# శరవేగంగా పాతబస్తీ మెట్రో..!

- కీలక దశకు రోడ్డు విస్తరణ పనులు
- 550కు పైగా ఆస్తుల కూల్చివేత
- రూ. 433 కోట్ల నష్టపరిహారం చెల్లింపు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీ మెట్రో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కారిడార్ నిర్మాణంలో ప్రధానమైన రోడ్డు విస్తరణ పనులు కీలకదశకు చేరుకున్నాయి. రోడ్డు మధ్యలో నుంచి 100 మీటర్ల వెడల్పుతో ఉన్న ఆస్తులను హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) అధికారులు సేకరిస్తున్నారు. వచ్చే నెలాఖరులోగా ప్రభావిత ఆస్తులను తొలగించి క్షేత్రస్థాయిలో పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మెట్రో రెండో దశ విస్తరణలో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గాన్ని చేపడుతున్న విషయం తెలిసిందే. పార్ట్-ఏ, పార్ట్-బీ కింద ప్రతిపాదించిన మొత్తం 8 కారిడార్లలో ముఖ్యంగా ఓల్డ్‌సిటీ మార్గాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కేంద్రం నుంచి డీపీఆర్‌కు అనుమతి వచ్చేలోగా ప్రాజెక్టులో అవసరమైన కీలక పనులను పూర్తిచేసేందుకు అడుగులు వేస్తోంది.

## డీజీపీఎస్ సర్వేతో మెట్రో స్తంభాలు, స్టేషన్ల ఖరారు

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల పనులను రూ.2,741 కోట్ల వ్యయంతో చేపడుతున్నారు. ఈ మార్గంలో సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, శంషేర్‌గంజ్, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. కారిడార్‌లో మెట్రో స్తంభాలు, స్టేషన్ల నిర్మాణానికి 'డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్' (డీజీపీఎస్) సర్వే చేపడుతున్నారు. డీజీపీఎస్ నుంచి పొందిన డేటాను గతంలో ఓల్డ్ సిటీలో చేసిన డ్రోన్ సర్వే నుంచి పొందిన డేటాతో అనుసంధానించి స్టేషన్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం 7.5 కిలోమీటర్ల విస్తీర్ణాన్ని కొన్ని భాగాలుగా విభజించి అవసరమైన ప్రదేశాల్లో కంట్రోల్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. హై- ప్రెసిషన్ గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్స్ (జీఎన్ఎస్ఎస్) రిసీవర్లను.. నిర్దేశిత ప్రదేశాలను కచ్చితంగా నిర్ణయించేందుకు

మిగతా 4వ పేజీలో..

### 100 మీటర్లకు ఒక మైలురాయి

కారిడార్ నిర్మాణంలో భాగంగా మొదట 1,100 ఆస్తులు ప్రభావితమవుతున్నట్లు అధికారులు గుర్తించారు. వినూత్న ఇంజినీరింగ్ పరిష్కారంతో అలైన్‌మెంట్‌ను సరిచేసిన అధికారులు ఆస్తుల సంఖ్యను క్రమక్రమంగా తగ్గిస్తూ వచ్చారు. 886 ఆస్తులు అవసరం అవుతుందని తేల్చారు. 550పైగా ఆస్తుల కూల్చివేతను ఇప్పటికే పూర్తి చేశారు. మెట్రో పనులు సజావుగా చేపట్టేందుకు నిర్దేశిత నిడివిలో 100 మీటర్లకు ఒక మైలురాయి ఏర్పాటు చేస్తున్నారు.




మైలు రాళ్ల ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

# శరవేగంగా పాతబస్తీ మెట్రో..

(3వ పేజీ తరువాయి)

ఉపయోగిస్తున్నారు. ఉపగ్రహాల నెట్‌వర్క్ ద్వారా పొందిన సిగ్నళ్ల ఆధారంగా స్టేషన్ల స్థానాలను కచ్చితంగా గుర్తిస్తున్నారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం రహదారిని 100 అడుగులకు విస్తరించి, ప్రభావిత ఆస్తులను కూల్చివేస్తున్నారు. మెట్రో స్తంభాల కోసం పునాదులను వేసే ముందు భూమి కింద ఉన్న యుటిలిటీలను పక్కకు మళ్లించడంలో వాటర్‌బోర్డు, జీహెచ్ఎంసీ, టీజీఎస్పీడీసీఎల్, బీఎస్ఎన్ఎల్, ఇతర ఏజెన్సీల సహకారాన్ని తీసుకుంటున్నారు. యుటిలిటీలను గుర్తించేందుకు గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) సర్వే చేపట్టారు.



డీజీపీఎస్ సర్వే చేస్తున్న అధికారులు

## త్వరలో నిర్మాణ పనులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా పాత నగరంలో రోడ్డు విస్తరణ పనులను చేపడుతున్నాం. ప్రభావిత ఆస్తులకు సంబంధించిన యజమానులకు రూ.433 కోట్ల నష్టపరిహారం అందజేశాం. త్వరలో పనులు ప్రారంభిస్తాం. పాతబస్తీ ప్రజల చిరకాల స్వప్నమైన మెట్రో రైలును పట్టాలెక్కించేందుకు కృషిచేస్తాం.

- ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో ఎండీ